ప్రజాశక్తి

మంగళవారం 2 సెప్టెంబర్ 2025



ఫెర్టిలిటీ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

డిఎంహెచ్ఒ జీవనరాణి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాలోని ఫెర్టిలిటీ కేంద్రాలు నిర్వహించే ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి తలెఇపారు. విజయనగరం జిల్లాలో మూడు ఫెర్టిలిటీ కేంద్రాలు మాత్రమే సెంట్రల్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకొని అనుమతులు పొందాయని తెలిపారు. దరఖాస్తులను జిల్లా స్థాయి ఇన్‌స్పెక్షన్ టీమ్ పరిశీలించి రాష్ట్ర స్థాయి టీమ్‌కు పంపిస్తుందన్నారు. రాష్ట్ర స్థాయి టీం పరిశీలించిన తరువాత అర్హత ఉన్న కేంద్రాలకు సర్టిఫికెట్ జారీ చేస్తారని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఎవరైనా కేంద్రాలను నిర్వహిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ ఎంపిక నిషేద చట్టం 1994 ప్రకారం అనుమతి పొందిన స్కానింగ్ కేంద్రాల్లో ఫెర్టిలిటీ సేవలు అందిస్తున్నట్లైతే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు.

ఎన్‌టిఆర్ వైద్య సేవలు ఉత్తివేనా?

ప్రజాశక్తి- కంటోన్మెంట్

- సేవలందించని ప్రైవేటు ఆస్పత్రులు
- రోగులను నిలువు దోపిడీ
- ఉచితం పేరుతో ఒపి, టెస్టులకు డబ్బులు వసూళ్లు

ఇటీవల నెల్లిమర్ల మండలానికి చెందిన ఒక బాలుడు అనారోగ్యానికి గురయ్యాడు. ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా విజయనగరంలోని సింహాచలం మేడ సమీపాన ఉన్న ఆస్పత్రికి తరలించారు. రెండు రోజుల తర్వాత ఎన్‌టిఆర్ వైద్య సేవ వర్తించదని చావు కబురు చల్లగా చెప్పారు. నిరుపేదలైన ఆ కుటుంబం అప్పు చేసి ఆస్పత్రికి డబ్బులు చెల్లించుకోవాల్సి వచ్చింది.

ధర్మపురి జంక్షన్ ఐస్ ఫ్యాక్టరీ సమీపాన కొత్తగా ఏర్పాటు చేసిన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఓ ఉద్యోగి కాలు విరిగిపోయి ఆపరేషన్ కోసం చేరాడు. ఆస్పత్రి యాజమాన్యం ఆయనకు ఎంప్లాయీస్ హెల్త్‌కార్డు ద్వారా ఇన్సూరెన్సు పెడుతూనే రూ.30 వేలు డిమాండ్ చేసి ముక్కుపిండి వసూలు చేసింది.

శృంగవరపుకోట మండలం తలారి గ్రామానికి చెందిన జి.ముత్యాలమ్మకు పక్షవాతం లాగా రావడంతో నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపాన ఒక కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. బ్రెయిన్ స్కాన్, టెస్టులు చేసిన తర్వాత ఎన్.టి.అర్ వైద్య సేవలు వర్తించవని చెప్పడంతో ఆమెను కుటుంబ సభ్యులు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ఎన్‌టిఆర్ వైద్య సేవ సమాచార కేంద్రం

ఇవి మచ్చుకు మాత్రమే. రోజూ ఇలాంటి రోగులు జిల్లా వ్యాప్తంగా వందల్లో ఉంటున్నారు. వీరెవరికీ నగరంలోని ఒకటి రెండు ఆస్పత్రులు మినహా మిగతా ఆస్పత్రులేవీ ఎన్‌టిఆర్ వైద్యసేవలు అందించడం లేదని రోగులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలకు, ఆచరణకు పొంతన లేదు. ప్రభుత్వం కోట్లాదిరూపాయలు బకాయిలు చెల్లించడం లేదని ఆస్పత్రి యాజమాన్యాలు రోగుల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నాయి. అత్యవసర సమయాల్లో వివిధ రూపాల్లో మరింత దోచుకుంటున్నాయి. ముందుగా అన్ని రకాల పరీక్షలు చేసిన తర్వాత ఎన్టీఆర్ వైద్య సేవ వర్తించదని ఆసుపత్రి యాజమాన్యాలు చెప్పడంతో రోగులకు ఏం చేయాలో పాలుపోక తప్పని పరిస్థితుల్లో డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకుంటున్నారు.

జిల్లాలో ఎన్‌టిఆర్ వైద్య సేవలు అందించే నెట్‌వర్క్ ఆసుపత్రులు 38 ఉండగా, వాటిలో 27 ప్రైవేట్ ఆసుపత్రులు, 11 ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయి. వీటితో పాటు మరో 15 ఆసుపత్రుల్లో ఉద్యోగులు, జర్నలిస్టు, ఫెన్షనర్ల కు ఇన్సూరెన్స్ కార్డుల ద్వారా దంత వైద్య సేవలు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 3257 వ్యాధులకు శస్త్ర చికిత్సను ఉచితంగా అందిస్తోంది. కానీ వీటిలో అత్యధిక ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు ఎన్‌టిఆర్ వైద్యసేవలు అందించేందుకు రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయి.

జిల్లాలో ఎన్‌టిఆర్ వైద్య సేవల ద్వారా చేసిన చికిత్సలు, అయిన ఖర్చు వివరాలు

సంవత్సరం	చికిత్సలు	ఖర్చు(కోట్లలో)
2019-20	31,357	73.06
2021-21	35,776	84.69
2021-22	62,508	123.59
2022-23	61,053	123.61
2023-24	71,388	138.41
2024-25	73,620	143.34
2025-26	13,250	26.24

నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు

జిల్లాలో ఉన్న ఎన్‌టిఆర్ వైద్య సేవ ఆసుపత్రిలో నిబంధనల ప్రకారం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి. ఆసుపత్రుల్లో తనిఖీ చేసిన సమయంలో వైద్యులు ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రులపై తగు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఫిర్యాదులు వచ్చిన తిరుమల-మెడికవర్, నెల్లిమర్ల మిమ్స్, సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులపై ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ బిఆర్ ఒంబేద్కర్ విచారణకు ఆదేశించారు.

- కె.సాయిరాం, ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ విజయనగరం

వచ్చే విద్యాసంవత్సరానికి సిటియు సిద్ధం

మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సిటియు ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

వచ్చే విద్యాసంవత్సరం నాటికి దత్తిరాజేరు, మెంటాడ మండలాల్లో నిర్మాణంలో ఉన్న కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయ భవనాలు వినియోగానికి సిద్ధం అవుతాయని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. 2027 జూన్ నాటికి మొత్తం ఫేజ్ 1 పనులు పూర్తి కానున్నాయని తెలిపారు. విజయనగరం గాజులరేగ సమీపంలోని ప్రస్తుత గిరిజన విశ్వవిద్యాలయాన్ని సోమవారం సాయంత్రం సందర్శించారు. అక్కడి వైస్ ఛాన్సలర్ టి.శ్రీనివాసన్, ఇతర విభాగాధిపతులతో ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణంపై సమీక్షించారు. ప్రస్తుత భవనాల నిర్మాణం, ఇతర అంశాలపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను తిలకించారు. యూనివర్సిటీ సమస్యలను తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న యూనివర్సిటీకి విద్యుత్, తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ట్రైబల్ యూనివర్సిటీకి జాతీయ రహదారినుంచి అప్రోచ్ రోడ్డును నిర్మించాలని, యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న విద్యుత్ హైటెన్షన్ వైర్లను వెలుపలకు జరపాలని ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, యూనివర్సిటీ భవన నిర్మాణాన్ని నాణ్యతతో వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కొత్త భవనాల్లో తరగతులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. సమావేశంలో విసి శ్రీనివాసన్‌తోపాటు, రిజిస్ట్రార్ జితేంద్ర మిశ్రా, ఫైనాన్స్ ఆఫీసర్ పికె దాస్, డీన్ శరత్ చంద్రబాబు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్‌వి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

ప్రజాశక్తి - గజపతినగరం

వర్షంతో గజపతినగరంలోని మెంటాడ రోడ్డుపై చేరిన నీరు

మండలంలో సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కుండపోత వర్షం కురిసింది. సుమారు నాలుగు గంటల పాటు కురిసిన వర్షంతో పొలాలు, రహదారులు జలమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఎప్పటిలాగే మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్ సమీపాన మెంటాడ రోడ్డులో మోకాలి లోతు నీరు చేరడంతో ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉన్న వాతావరణంలో వచ్చిన మార్పులకు ఒక్కసారిగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 6:30 వరకు మండల వ్యాప్తంగా కుండపోత వర్షం ఎడతెరిపి లేకుండా కురిసింది. దీంతో గజపతినగరం పరిసర ప్రాంతాలతో పాటు నగరంలో ఉన్న వారంతా ఎక్కడి వారు అక్కడే ఉండిపోయారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పర్యటన నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పట్టణానికి చేరుకోవడంతో వర్షం కారణంగా ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు ఈ వర్షం వరి పంటలకు ఎరువులు వేసుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రానున్న మూడు రోజులు భారీ వర్షాలు

విజయనగరంకోట : మయన్మార్ తీరప్రాంతం, దానికి ఆనుకుని ఉన్న ఈశాన్య బంగాళాఖాతంపై ఏర్పడిన ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉందని, ఉపరితల ఆవర్తనం వలన వచ్చే మూడు రోజులు విజయనగరం జిల్లాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ సందర్భంగా రెవిన్యూ డివిజన్ కార్యాలయాలు , తహసీల్దార్ల కార్యాలయాలు, నగరపాలక సంస్థ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి 24 గంటలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తూ కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్‌కు 08922-236947 సమాచారం అందజేయాలని జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖలకు కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా, సోమవారం విజయనగరం, గజపతినగరం, బొండపల్లి మండలాల్లో భారీ వర్షం కురిసింది.

కెఫ్‌సి ఎదుట తెలుపుతున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

ఎస్‌ఎఫ్ఐ నాయకులపై

కెఫ్‌సి సిబ్బంది దాడి

అమెరికా టారిఫ్‌లకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కెఫ్‌సి సిబ్బంది దాడిలో గాయపడిన ఎస్ఎఫ్ఐ నాయకుడు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అమెరికా టారీఫ్ లు పెంపునకు వ్యతిరేకంగా స్వదేశీ సరుకుల్ని వినియోగించాలి.. అమెరికా సరుకులను వ్యతిరేకించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న కె ఎఫ్ సి వద్ద విద్యార్థులు నిరసన తెలిపారు. దీంతో కెఎఫ్‌సిలో పనిచేస్తున్న సిబ్బంది, ఉద్యోగులు ఎస్ఎఫ్ఐ నాయకులతో వాగ్వివాదానికి దిగి భౌతిక దాడులకు తెగబడ్డారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహయ కార్యదర్శి పి.రమేష్ మొఖం మీద పిడిగుద్దులు గుద్దడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే పోలీసులను ఎస్ ఎఫ్ ఐ నాయకులు ఆశ్రయించారు. రక్తం కారుతున్న రమేష్ ను ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఇరువురినీ పోలీసులు ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ అమెరికా టారిఫ్‌లను నిరసిస్తూ శాంతియుతంగా నిరసన చేస్తున్న తమపై కెఫ్‌సిలో పని చేస్తున్న సిబ్బంది దాడికి దిగారన్నారు. రక్తం వచ్చేలా పూలు కుండీల సిమెంట్ దిమ్మలతో కొట్టారని తెలిపారు. తమపై దాడి చేసిన వారిపై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవికుమార్, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్, నాయకులు వంశీ, రమణ, సూరిబాబు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఆటో, మోటారు రంగ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యాన ఆటో, ట్యాక్సీ, మోటారు రంగ కార్మికులు సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తొలుత పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి దేవి జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కూడలిలో మానవహారం నిర్వహించారు. అక్కడి నుంచి తహశీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని, ధర్నా చేశారు. తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి అందించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడంతో ఆటో, మోటార్ రంగ కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆటో కార్మికులను ఆదుకోవాలని, లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కె.భీముడు, సిఐటియు నాయకులు సిహెచ్.ముత్యాలు, పలు యూనియన్ల నాయకులు వి.లక్ష్మీనారాయణ, మద్ది కృష్ణ, పి.నర్సింగరావు, ఆర్.సన్యాసిదేముడు, బి.సురేష్, ఎం.మధు, కృష్ణంనాయుడు, ఎం. గోవింద, జై బాబు. ఎం.అప్పన్నదొర, కె.అప్పారావు పాల్గొన్నారు.

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి

ఎమ్‌పి కలిశెట్టి

ప్రజాశక్తి-విజయనగరంకోట

మాట్లాడుతున్న ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

మహిళలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక మెసానిక టెంపుల్‌లో నిర్వహించిన 'సూపర్ సిక్స్- సూపర్ హిట్ స్త్రీశక్తి కార్యక్రమంలో ఎంపి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళలు స్వయం శక్తిగా ఎదగడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో మహిళలకు డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి వారి ఎదుగుదలకు ఆర్థికంగా భరోసా కల్పించిన నాయకుడు చంద్రబాబని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. అనంతరం నియోజకవర్గంలో స్వయం శక్తిగా ఎదుగుతూ సమాజ సేవ చేస్తున్న అంగన్వాడీ కార్యకర్త రమాదేవి, సేంద్రియ వ్యవసాయంతో పలువురుకు ఆదర్శంగా నిలుస్తున్న సిరిపురపు లక్ష్మి దుప్పాడ, చెల్లూరు గ్రామానికి చెందిన గోగాడ బంగారంను సన్మానించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పి.కనకమహాలక్ష్మి, తెలుగు మహిళా పార్లమెంట్ అధ్యక్షురాలు సువ్వాడ అనురాధ బేగం పాల్గొన్నారు.

ప్రజల కోసం పరితపించే ముఖ్యమంత్రి

సిఎం చంద్రబాబు నిత్యం ప్రజల కోసం పరితపిస్తున్నారని ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పి.అదితి అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేసి 30ఏళ్లయిన సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వీరు మాట్లాడారు. హైదరాబాద్‌ను సాఫ్ట్‌వేర్ రంగంలో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు.

పిజిఆర్ఎస్‌కు 188 వినతులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రతీ వారం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చే వినతులకు సంపూర్ణ న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 188 వినతులు వచ్చాయి. ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించి 64 వినతులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు త్వరలో పిజిఆర్ఎస్ కు సంబంధించి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అసలైన ఫిర్యాదుదారులకు న్యాయం చేకూర్చే విధంగా అధికారులు వ్యవహరించాలని సూచించారు. పరిష్కరించలేని పక్షంలో దానికి కారణాలను అర్జీదారులకు స్పష్టంగా తెలిపారు.

గురువారంలోగా డాక్యుమెంట్స్ అప్‌లోడ్ .. జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ఐటి శాఖ వెబ్‌సైట్‌లో అన్ని శాఖలు వారి ముఖ్యమైన శాఖా మెమోలు, ప్రభుత్వ ఉత్తర్వులు కాపీలు వచ్చే గురువారం లోగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

5నుంచి రోటరీ క్లబ్ యువజనోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 5నుంచి విజయనగరం రోటరీ మెయిన్ క్లబ్ యువజనోత్సవాలు ప్రారంభం అవుతాయని రోటరీ యూత్ సర్వీస్ డైరెక్టర్ బి.హేమ కుమార్ తెలిపారు. యువజనోత్సవాల కరపత్రాలను సోమవారం రోటరీ జోన్ సభ్యత్వ సమన్వయకర్త దీపక్ పురోహిత్, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, పూర్వ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వర రావు ఆవిష్కరించారు. నెల రోజుల పాటు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 5న రోటరీ కమ్యూనిటీ హాలులో అన్నమయ్య కీర్తనలు, 6న భగవద్గీత పఠన పోటీ, 7న వకృత్వం, చిత్రలేఖన పోటీలు, 10న బృంద నృత్యాలు, 11న వ్యాసరచన, 13న కస్పా హైస్కూల్‌లో కబడ్డీ, స్పెల్ బి, 14న ఖో ఖో, శాస్త్రీయ నృత్యం, 16న విచిత్ర వేషధారణ, 18న నాటికలు, 20న క్విజ్, 21న యోగా, చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ మెయిన్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వి. శ్రీనివాసరావు, డాక్టర్ బి.రాధికారాణి, క్లబ్ సభ్యులు మాటూరు మురళీకృష్ణ, కొండేటి శ్రీనివాస్, జ్యోతి బచావత్, మాతృశ్రీ తదితరులు పాల్గొన్నారు.

3న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈ నెల మూడో తేదిన బొబ్బిలి కోటలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అపోలో, డెక్కన్, హెటెరో వంటి 10 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బిటెక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్జీలకు సత్వర న్యాయం

ఎస్‌పి వకుల్ జిందల్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పిజిఆర్ఎస్‌కు అందే అర్జీలకు చట్ట పరిధిలో సత్వర న్యాయం చేకూర్చాలని ఎస్‌పి వకుల్ జిందల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. దీనికి 28 అర్జీలు అందాయి. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత పోలీసు అధికారులతో ఎస్‌పి వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, చర్యలకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్

గవర్నర్ అశోక్‌ను కలిసిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

అశోక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజును జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్‌గా బాధ్యతలను స్వీకరించి తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన అశోక్‌ను బంగ్లాలో వీరంతా కలుసుకొని పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మను దర్శించుకున్న అశోక్

విజయనగరం టౌన్ : పైడితల్లమ్మ ఆలయాన్ని గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు సోమవారం దర్శించుకున్నారు. సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పైడితల్లి అమ్మవారి దేవస్థానం సహాయ కమిషనర్ శిరీష, సూపరింటెండెంట్ వైవి రమణి పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ కోసం పోరాటం

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

గల్లీ నుండి ఢిల్లీ వరకు బిసిల హక్కుల సాధనకు, రాజ్యాంగ బద్ధ రక్షణల కోసం పోరాటం సాగిస్తూ ఉంటామని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తెలిపారు. సోమవారం విజయనగరం ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. నూతనంగా ఎంపికైన జిల్లా అధ్యక్షునికి నియామక పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 139 బిసి కులాల ప్రజలందరి అవసరాలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల వసతిగృహాల సమస్య నుండి, జాతీయస్థాయిలో జనగణనతోపాటే కులగణన చేయాలనే డిమాండ్ వరకు అనేక పోరాటాలు నిర్వహించి, ఎన్నెన్నో విజయాలు సాధించామన్నారు. ప్రతి గ్రామం, వార్డు, డివిజన్‌లో బిసిల జెండా ఎగిరేలా జిల్లా కమిటీ కృషి చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు గదుల వెంకటరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు తోటపల్లి బుజ్జిబాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు వాళ్ళే హరిప్రసాద్, గువ్వల ప్రసాద్, సబ్బి నాగేశ్వరరావు, దువ్వ వేణు, జిల్లా కార్యదర్శి వడిశల శ్రీనివాసరావు, దేనబోయిన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో వేడుకలను ప్రారంభిస్తున్న యూనియన్ బ్యాంకు బ్రాంచి మేనేజర్ సురేంద్రరావు

ఘనంగా జీవిత బీమా వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో జీవిత బీమా సంస్థ 69వ వార్షికోత్సవం సందర్భంగా బీమా వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. డిసిసిబి సిఇఒ సిహెచ్ ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలసీ దారులకు మెరుగైన సేవలు అందించడంలో ఎల్ఐసి ముందంజలో ఉందని చెప్పారు. ప్రజల నమ్మకం, ఆదరణతోనే 69 ఏళ్ల నుంచి విశేషమైన సేవలు అందిస్తుందని చెప్పారు. జీవిత బీమా ప్రజలకు రక్షణగా ఉంటుందని తెలిపారు. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.జగదీష్ బాబు మాట్లాడుతూ ప్రజలకు ఆపదలో ఆర్థిక భరోసాను అందించే అనేక పాలసీలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఎల్ఐసి పాలసీ చేసి తమ కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ఏజెంట్లు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఎల్ఐసి ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం శృంగవరపుకోట బ్రాంచిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ రాజు ఆధ్వర్యాన నిర్వహించిన వారోత్సవాలను యూనియన్ బ్యాంకు మేనేజర్ సురేంద్రరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

గరివిడి : ఎల్ఐసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గరివిడి బ్రాంచ్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ బోని వెంకటకుమార్ ఆధ్వర్యాన నిర్వహించిన వేడుకలను చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు ప్రారంభించారు. చీపురుపల్లి సిఐ జి.శంకర్రావు, క్లాస్ వన్ అధికారుల ప్రతినిధులు జెజె రామారావు, ఎస్.కృష్ణప్రసాద్, ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధార్థ, వెంకటేష్, ఏజెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి నడిమిటి సత్యనారాయణ, డిఒల అసోసియేషన్ ప్రతినిధి ఎంపి నాయుడు, కంది సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గరివిడి.. మాట్లాడుతున్న డిఎస్‌పి రాఘవులు

ప్రశాంతమైన జిల్లా పేరును నిలబెడదాం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ప్రశాంతమైన విజయనగరంజిల్లా పేరును నిలెబెట్టుకునేందుకు ప్రతీఒక్కరూ సహకరించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జిల్లా శాంతి కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెలలో వినాయక నిమజ్జనం, దసరా ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబి పండగలు ఉన్న కారణంగా అవన్నీ ప్రశాంతమైన వాతావరణంలో జరిగేటట్లు చూడాలని కోరారు. వేరే మతానికి సంబంధించిన పొరపాట్లను సర్దుకుపోవడం, శాంతి, సామరస్యం ద్వారా ఎలాంటి అల్లర్లు జరగకుండా చూడవచ్చని సూచించారు. ఎస్‌పి వకుల్‌జిందల్ మాట్లాడుతూ మతపరమైన గొడవలు జరగకుండా చూడాలని కోరారు. ఏ చిన్న పొరపాటు జరిగినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. పోలీసు వారిచ్చిన సూచనలను పాటించాలన్నారు. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ, ఇప్పటివరకు అన్ని పండుగలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయని, ఇక ముందు కూడా అలానే జరగాలని కోరారు. తాహశీల్దార్లు, ఎస్‌హెచ్ఒలు సమన్వయంతో పండగలు శాంతియుతంగా జరిగేటట్లు చూడాలని కోరారు. సమావేశంలో డిఎస్‌పి ఎస్.శ్రీనివాస్ రావు, జిల్లా మైనారిటీ ఆఫీసర్ కుమారస్వామి వివిధ మత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల ఆందోళన

ప్రజాశక్తి-రామభద్రపురం

ఆందోళన చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్ అంబాసిడర్లకు బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బలస శ్రీను ఆధ్వర్యాన ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ఎండ, వాన, చలికి ఓర్చి గ్రామాలను పరిశుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు సుమారు 10 నుంచి 18 నెలల వేతనాలు బకాయి పెట్టడం అన్యాయమన్నారు. ఇన్ని నెలలు జీతాలు బకాయి ఉంచితే వాళ్ల కుటుంబాన్ని ఎలా పోషిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అనంతరం ఎంపిడిఒ రత్నానికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు గొల్లపల్లి. సూర్యనారాయణ, ఎస్.రాములు, కారంగి భవాని, గుంప సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

72వ రోజుకు జిందాల్ నిర్వాసితుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తమ భూములు తిరిగివ్వాలని కోరుతూ జిందాల్ నిర్వాసితులు మండలంలోని బొడ్డవరలో చేపడుతున్న నిరసన సోమవారం 72వ రోజుకు చేరింది. నెల తరబడి నిరసన తెలియజేస్తున్నా అధికారులు గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోలేదని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. జిందాల్ కంపెనీ చెప్పిన మాయమాటలు నమ్మి ఘోరంగా మోసపోయామన్నారు. తమకు ఉద్యోగాలు, షేర్లు ఇస్తామని మోసం చేసిన కంపెనీ యాజమాన్యాన్ని తక్షణమే అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు.

ఆలయ నిర్మాణానికి లక్ష విరాళం

ప్రజాశక్తి - వేపాడ (భోగాపురం)

భీమునిపట్నం మండలం తగరపువలసలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ ఉమారామ లింగేశ్వర, అయ్యప్పస్వామి దేవాలయం నిర్మాణం కోసం మార్కెఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగార్రాజు రూ. లక్ష విరాళంగా అందించారు. భోగాపురం మండలంలోని పోలిపల్లిలో ఆయన స్వగృహం వద్ద ఈ మొత్తాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని పారాది, నారశింహునిపేట సబ్ స్టేషన్ల పరిధిలోని మెట్టవలస, నారాయణప్పవలస, సిహెచ్ బొడ్డవలస ఫీడర్ల గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఇఇ బి.రఘు తెలిపారు. 24 గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు లైన్ పనులు చేపట్టేందుకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నానో ఎరువులపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం కోట

మండలంలోని కొండకరకాంలో రైతులకు నానా ఎరువులపై మండల వ్యవసాయాధికారి అద్దూరి శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. నానో యూరియా, నానా డిఎపి వినియోగం, ప్రయోజనాలపై వివరించారు. ప్రదర్శనా క్షేత్రం ఏర్పాటు చేసి ప్రయోగాత్మకంగా వివరించారు. కోరమండల్ కంపెనీ ప్రతినిధులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో సత్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల విశాఖపట్నం జిల్లా మునగపాకలో జరిగిన కబడ్డీ టోర్నమెంట్ లో సత్య కళాశాల విద్యార్థులు మొదటిస్థానంలో నిలిచారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరుపతిలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి పఠాన్ ఖాజా తృతీయ స్థానం సంపాదించి కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థులనుకళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి, తదితరులు అభినందించారు.

మౌలిక వసతులు కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జగనన్న కాలనీల్లో పేదలకు మౌలిక వసతులు కల్పించాలని సోమవారం కలెక్టరేట్ వద్ద సిపిఐ ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు బుగత అశోక్, దేగల అప్పలరాజు మాట్లాడారు. ఎస్.కోట నెయ్యల వీధి జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్కు వినతి అందజేశారు.

కృష్ణవలసలో తాగునీరు వృథా

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలోని కృష్ణవలసలో తాగునీరు వృథా పోతోంది. గ్రామానికి రక్షిత మంచి నీటి ట్యాంక్ నుండి సరఫరా అయ్యే పైప్ లైన్ లీక్ అవ్వడంతో వేలాది లీటర్లు తాగు నీరు వృథాగా సమీపంలో ఉన్న కొండగూడెం చెరువులో కలిసిపోతోంది. మరోవైపు గ్రామంలో పంచాయతీ సిబ్బంది తమకు సక్రమ సమయంలో నీరు విడుదల చేస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తాగునీరు వృథా పోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్ఆర్ నగర్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక వైఎస్ఆర్ నగర్‌లో ఎపి చారిటబుల్ ట్రస్ట్, డి కింగ్స్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జనసేన నాయకులు గురాన అయ్యలు ప్రారంభించారు. అధిక సంఖ్యలో యువత రక్తదానం చేశారు. వారిని అయ్యలు అభినందించారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, బుల్లెట్ శ్రీను సాయి, బల్ల గౌరీశంకర్, బండారు వంశీ, భాస్కర్, భాను, వర్ధన్, కళ్యాణ్ విక్రమ్, స్వామిసందీప్, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మాస్త్రంతో పురుగుల నివారణ

ప్రజాశక్తి-వేపాడ

బ్రహ్మాస్త్రం కషాయంతో వరిలో వచ్చే ఆకు ముడత, రసం పీల్చే లార్వా పురుగులను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. వేపాడలో సోమవారం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో బ్రహ్మాస్త్రం కషాయాన్ని తయారు చేయించారు. దీనివల్ల రైతులకు పురుగు మందుల ఖర్చులు తగ్గి, పంట బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ కోమలత, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ, యూనిట్ ఇన్‌ఛార్జి రామలక్ష్మి, ఐసిఆర్‌పిలు పద్మ, శ్రీను పాల్గొన్నారు.

రహదారి కష్టాలు తీర్చండి

ప్రజాశక్తి - గరివిడి

రహదారిపై ప్రవహిస్తున్న నీరు

గరివిడి, గర్భాం రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా ఉందని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ రహదారిలో వేల సంఖ్యలో రోజూ రాకపోకలు జరుగుతున్నాయని, విద్యార్థులు, కార్మికులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వాపోతున్నారు. వర్షం పడితే సముద్రం తలపించేలా నీరు నిలువ ఉండిపోతుందని, ప్రయాణం కష్టంగా ఉంటుందని చెబుతున్నారు. నీరు నిల్వ వల్ల సీజనల్ వ్యాధులకు గురయ్యే అవకాశాలు ఎక్కువుగా ఉన్నాయని సంబందిత అధికారులు స్పందించి ఈ రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటామని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ప్రభావతి, రమ అన్నారు. పట్టణంలోని 27, 28 వార్డులు, ఐటిఐ కాలనీలో సోమవారం పోషకాహర వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్వాడీ సరుకులను సక్రమంగా వాడాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో నీటి సరఫరా అంతరాయం మళ్ళీ మొదటికి వచ్చింది. మూడు నెలల క్రితం నగర పంచాయతీలో నీటి సరఫరా అంతరాయం ఏర్పడి మరమ్మతులు జరిపి సరఫరా ప్రారంభమైంది. సోమవారంఅగురు వీధి, జంగాల వీధి, సువ్వాని వీధులు, బైరెడ్డి వీధి, ఎరుకుల వీధి, నాయుడు కాలనీ, యాత వీధులకు నీటి సరఫరా లో అంతరాయం ఏర్పడింది. అగురు వీధి పంప్ హౌస్ నుండి పంచాయతీ ఆఫీస్ వెనుక ఉన్న 130 కిలో లీటర్ల రిజర్వాయర్‌కు సంబందించిన పంపింగ్ లైను బరస్ట్ అయినందున మరమ్మత్తులు చేసి మంచి నీటి సరఫరా చేసేందుకు 2 రోజులు సమయం పడుతుందని కమిషనర్ టి. జయరాం తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మరమ్మతులకు గురైన మంచి నీటి పంపింగ్ లైన్ పరిశీలించారు. ప్రజలు నీటి సరఫరా అంతరాయానికి సహకరించాలని కోరారు.

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం గ్రామ సచివాలయాన్ని సోమవారం ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ సందర్శించారు. తొలుత సామాజిక పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. పారిశుధ్య పనులను పరిశీలించి, ఎస్‌డబ్ల్యుపిసిని తనిఖీ చేశారు. కార్యదర్శి కృష్ణారావుతో మాట్లాడుతూ ప్రతిరోజూ పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

దేవాడ మైన్స్ లీజును పునరుద్ధరించాలి

ఎమ్మెల్యే కళా వెంకటరావుకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - చీపురుపల్లి

గరివిడి మండలంలోని సదానందపురం మైన్స్ లీజును పునరుద్ధరించి కార్మికుల ఉపాధిని కాపాడాలని సంబంధిత కార్మికులు సిఐటియు నాయకులు స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటకవు విజ్ఞప్తి చేశారు. సోమవారం చీపురుపల్లిలోని టిడిపి కార్యాలయంలో కళాను సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైన్స్ లీజు ఈ ఏడాది సెప్టెంబర్ 14తో ముగుస్తుందని తిరిగి ఆ మైన్స్ లీజును పునరుద్ధరించి సుమారు 503 మంది కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరారు.

ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేసిన కార్మికులు

నియోజకవర్గంలో గల ఈ మైన్స్‌లో గరివిడి, గుర్ల మండలాలలో గల దేవాడ, నాగేళ్లవలస, తోంద్రంగి గ్రామాలకు చెందిన కార్మికులు 1975 నుండి అక్కడే పని చేసుకుంటూ జీవిస్తున్నామని వివరించారు. ఈ మైన్ ద్వారా సుమారు వెయ్యి మంది ప్రత్యక్షంగాను, పదివేల మంది పరోక్షంగాను ఉపాధి పొందుతున్నారని, ఈ లీజుని పునరుద్ధరించి కార్మిక కుటుంబాలని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంబల్ల గౌరినాయుడు, విజయ విశ్వనాథరాజు, పి.అప్పలనాయుడుతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

సాగు నీరిచ్చి ఆదుకోండి

తమ పొలాలకు సంబంధించి చెరువు మధ్య నుండి తోటపల్లి కాలువ వెళ్లిపోవడంతో తమ పంట పొలాలకు సాగునీరు రావడంలేదని అందువల్ల పంటలన్నీ ఎండిపోతున్నాయని సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని చీపురుపల్లికి చెందిన కొంతమంది రైతులు ఎమ్మెల్యే కళా వెంకట్రావుకి మొరపెట్టుకున్నారు. సోమవారం చీపురుపల్లి వచ్చిన ఎమ్మెల్యేను రైతులు కలిసి తమ గోడును విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీపురుపల్లి పంచాయతీ పరిధిలో గల నారప్ప చెరువు మీద నుండి గజపతినగరం వెళ్లే తోటపల్లి కాలువను తవ్వేయడం వల్ల రైతులకు అటు చెరువు నీరు లేక ఇటు కాలువ నీరు రాక పంటలు ఎండిపోయి చాలా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఎలాగైనా సాగునీరు అందించి 150 ఎకరాలలో సాగుచేసిన తమ పంటలను ఆదుకొని తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు.

ప్రజలను మోసగించిన చంద్రబాబు : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

హామీలు అమలు చేయడంలో సిఎం చంద్రబాబు విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు విమర్శించారు. మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో సోమవారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సిఎం చంద్రబాబు ప్రజలను మోసం చేశారని ఆయన దుయ్యబట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు సావు వెంకట మురళీకృష్ణ, ఇంటి గోపాలరావు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బాబు మోసాలపై పోరాటం : కోలగట్ల

విజయనగరం టౌన్ : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తమపోరాటం కొనసాగుతుందని మాజీడిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సోమవారం సిఎంఆర్ షాపింగ్ మాల్ పక్కన విఆర్ గ్రాండ్‌లో నిర్వహించిన వైసిపి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, సూపర్ సిక్స్ పథకాలను ఏడాది పూర్తయినా ప్రజలకు అమలు చేయడం లేదన్నారు. హామీలను శతశాతం ప్రజలకు అందే వరకు మా పోరాటం కొనసాగుతుందని అన్నారు. విజయనగరం మండలంలో 22 పంచాయతీలకు గాను 14 పంచాయతీలలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకుగాను ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కెల్ల త్రినాధరావు, వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, రిటైర్డ్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ (వైసిపి) జిల్లా అధ్యక్షులు డోల మన్మధ కుమార్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కిలారి రాంబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, సర్పంచ్లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పింఛన్ల ఘనత టిడిపిదే : ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- రాజాం

దేశం లో మొదటి సారి పింఛన్లను తీసుకొచ్చిన ఘనత టిడిపికే దక్కుతుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీ న్నారు. స్థానిక పుచ్చలవీధిలో ఆయన సోమవారం ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, నాయకులు గురవాణ నారాయణరావు, టంకాల కన్నంనాయుడు, సురేంద్ర, ముగడ శ్రీను, అప్పల నాయుడు, కోటగిరి నారాయణరావు, బనిశెట్టి వెంకట రమణ, తూతిక చిట్టి, కాటం శ్రీను, మొగదాల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంకోట : విజయనగరం మండలం గుంకలాం గ్రామం, నగరంలోని 6వ డివిజన్ జమ్ములో సోమవారం పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు అన్ని లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని అడుగుతూ ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, జొన్నవలస ఎంపిటిసి రాజేష్ బాబు, రాకోడు ఎంపిటిసి వేచలపు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, అవనాపు విజయ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలోని ఐదో వార్డులో సోమవారం ఎమ్మెల్యే బేబినాయన సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. అర్హులందరికీ పింఛన్లను అందిస్తున్నామని బేబినాయన చెప్పారు. ఎన్నికల ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్ హైమవతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సౌభాగ్య లక్ష్మికి సన్మానం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

చోడమ్మ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా మూడు దశాబ్దాలకుపైగా సేవలందించిన కె. సౌభాగ్యలక్ష్మి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆమెను సోమవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఆమె విద్యారంగంలో చూపిన కృషి, విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడంలో అందించిన సేవలను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు, మాజీ సర్పంచ్ పిల్ల లక్ష్మీనారాయణ, ఎంఇఒ రాజ్‌కుమార్, పిఆర్‌టియు, యుటిఎఫ్, ఎపిటిఎఫ్ నాయకులు, వైకుంఠ రమణ, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు దుర్మార్గం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తిరుపతి జిల్లా చంద్రగిరిలో దళితులపై టిడిపి కార్యకర్తలు దాడి చేయడం దుర్మార్గమని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఖండించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా చంద్రగిరిలో వినాయక నిమజ్జనంలో దళితుల పై టిడిపి కార్యకర్తలు దారుణంగా దాడి చేసికొట్టారని, ఇళ్ళు కూడా ధ్వంసం చేయడం దుర్మార్గమని న్నారు. రాష్ట్రంలో దళితులకు స్వేచ్ఛగా జీవించే హక్కు లేదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుండి ఈ రాష్ట్రంలో దళితులు, దళిత మహిళలపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని ధంసమైన గృహాలుకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

పేదలకు పట్టెడన్నం పెట్టేందుకే అన్న క్యాంటీన్లు

ప్రజాశక్తి - చీపురుపల్లి

పేదలకు పట్టెడన్నం పెట్టేందుకే అన్న క్యాంటీన్లని ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే కళావెంకటరావు అన్నారు. సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన తహశీల్దారు కార్యాలయం ఆవరణలో అన్న క్యాంటిన్‌కి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ నిధులు సుమారు రూ.61 లక్షల వ్యయంతో అన్న క్యాంటిన్ నిర్మిస్తున్నామన్నారు. అంతక ముందు స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఫించన్లను పంపిణీ చేశారు. స్థానిక రాధామాధవ ఫంక్షన్ హాలులో జరిగిన స్త్రీశక్తి విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దే బాబురావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, నాయకులు రౌతు కామునాయుడు, పైల బలరాం, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, జనసేన నాయకులు కోట్ల కృష్ణ, విసినిగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాలనలో చంద్రబాబునాయుడు దేశానికే ఆదర్శనీయం

రాష్ట్రానికి 30 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబునాయుడు పాలనలో దేశానికే ఆదర్శనీయుడని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. చీపురుపల్లిలో గల ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. మూడు దశాబ్దాల పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేసి ప్రపంచ స్థాయి నాయకుడిగా చంద్రబాబునాయుడు గుర్తింపు పొందారని అన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమ రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ పాలన అందించడంలో చంద్రబాబు దిట్ట అని అన్నారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రకాశరావును సన్మానిస్తున్న శ్రీశ్రీ కళా వేదిక సభ్యులు

'కడలికి' తెలుగు తేజం అవార్డు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని జరజాపు పేటకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం, చిత్రకారుడు, కవి, రచయిత, కడలి ప్రకాశరావు మాస్టార్‌కు తెలుగు తేజం అవార్డు లభించింది. సోమవారం పల్నాడు జిల్లా నరసరావుపేట భువనచంద్ర టౌన్ హాల్‌లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు తేజం అవార్డు, ప్రశంసా పత్రం ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు, రాష్ట్ర గ్రంథాలయం చైర్మన్ కోటేశ్వరరావు, శ్రీశ్రీ కళావేదిక సిఇఒ కత్తిమండ ప్రతాప్ చేతులు మీదుగా కడలి ప్రకాశరావు అందుకున్నారు. కళావేదిక జాతీయ అధ్యక్షులు ఈశ్వరి భూషణం, ప్రధాన కార్యదర్శి టి. పార్థసారధి, జిల్లా అధ్యక్షులు శాంతాబాయి ఆయన్ను సత్కరించారు. అవార్డు రావడం పట్ల ప్రకాశరావు మాస్టర్‌ని పలువురు అభినందించారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి

ప్రజాశక్తి-తెర్లాం

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని పెరుమాళి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం...

పెరుమాళి గ్రామానికి చెందిన పొడ్ల రాము (23) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం ట్రాక్టర్‌ను కడిగేందుకు చెరువులో దించాడు. శుభ్రం చేసిన అనంతరం చెరువు గట్టు ఎక్కిస్తుండగా ట్రాక్టర్ ఇంజిన్ తిరగబడింది. కింద చిక్కుకుని రాము అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు ఆయన్ను బయటకు తీసి రాజాం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చేతికి అందొచ్చిన కుమారుడు ప్రమాదంలో మరణించడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

గాయపడిన వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని సారిపల్లిలో వాహనం ఢీకొన్న ప్రమాదంలో వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందారు. సోమవారం స్థానిక ఎస్ఐ బి.గణేష్ అందించిన వివరాలు ప్రకారం సారిపల్లి గ్రామానికి చెందిన మజ్జి అన్నపూర్ణ(65) గ్రామంలో ఆదివారం పాన్‌షాప్ వద్ద ఉండగా బొలెరో వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో విజయనగరంలో ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మృతురాలి అల్లుడు సారిపల్లి గురునాయుడు బొలెరో వాహనం నిర్లక్ష్యంగా నడిపడం వల్ల ప్రమాదం జరిగిందని ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - కంటోన్మెంట్

నగరంలోని జెఎన్‌టియు జంక్షన్ వద్ద సోమవారం స్కూటీని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. .వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. గజపతినగరం మండలం మధుపాడ గ్రామానికి చెందిన బొడ్డా న ఎర్రయ్య (23) విజయనగరం నుంచి జపతినగరం వైపు స్కూటీపై వెళ్తుండగా జెఎన్‌టియు జంక్షన్ వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎర్రయ్య అక్కడికక్కడే మృతి చెందగా, చరణ్ కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రైవేటు వాహనంలో చరణ్‌ను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. విజయనగరం వన్ టౌన్ సిఐ ఆర్.వి.ఆర్.కె చౌదరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డిమందు తాగి యువకుడు మృత్యువాత

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం మండలం కొండకరకం గ్రామానికి చెందిన పి.గంగరాజు(22) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసులు కథనం ప్రకారం... పి గంగరాజు ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఆదివారం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు .ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి అన్నయ్య సత్యనారాయణ ఫిర్యాదు మేరకు విజయనగరం రూరల్ ఎస్.ఐ వి అశోక్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 10 వేలు జరిమానా

ప్రజాశక్తి-రామభద్రపురం

ఇటీవల చేపట్టిన వాహన తనిఖీల్లో పట్టుబడ్డ కొండకెంగువ గ్రామానికి చెందిన ఎ.జనార్ధనరావుకు రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి, సాలూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టుకు తరలించగా, న్యాయమూర్తి హర్షవర్ధన్ విచారణ చేపట్టి, జరిమానా విధించినట్లు చెప్పారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

13 మందికి సిఎం సహాయనిధి చెక్కులు

అన్న క్యాంటీన్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన

ప్రజాశక్తి-గజపతినగరం

అనారోగ్య సమస్యలతో ఇబ్బందులను ఎదుర్కొంటూ ఆపదలో ఉన్న బాధితులను ఆదుకోవడంలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సిఎం సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన రూ.12,94,430 విలువైన చెక్కులను గజపతినగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 13 మంది లబ్ధిదారులకు మంత్రి శ్రీనివాస్ అందజేశారు. అంతకుముందు అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. రూ.61 లక్షల నిధులతో ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ అన్న క్యాంటీన్ భవనాన్ని నిర్మించనున్నారు. జిల్లాలో గజపతినగరం, కొత్తవలస, చీపురుపల్లిలో అన్న క్యాంటీన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ గోపాల రాజు, పిఎసిఎస్ చైర్మన్ లెంక బంగారు నాయుడు, మాజీ ఎంపిపి మక్కువ శ్రీధర్, టిడిపి గంట్యాడ మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, మండల నాయకులు ప్రదీప్ కుమార్, కుమార్ బాబు, మాజీ సర్పంచ్ లెంక చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనకు కృషి

దత్తిరాజేరు : రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకురావడం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. దత్తిరాజేరు మండలం కె.కృష్ణాపురంలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీకి ఆయన సోమవారం శ్రీకారం చుట్టారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కలిగి ఉండాలి

ఇన్స్పైట్ ఫౌండేషన్ అధ్యక్షులు చిన్నం నాయుడు

ప్రజాశక్తి.విజయనగరం టౌన్

భారతదేశం నా మాతభూమి భారతీయులందరూ నా సహోదరులన్న రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని ఇన్స్పైట్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొర్లె చిన్నం నాయుడు, న్యాయవాది పెనుమత్స కరుణాకర్ అన్నారు.స్థానిక కేంద్రీయ విద్యాలయంలో ఇన్స్పైట్ సంస్థ ఆధ్వర్యంలో రాజ్యాంగం-సౌభ్రాతత్వం అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సోమవారం బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దిలీప్ మోదీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10 నుంచి సిమ్స్ చర్చి 150 వసంతాల వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

మత సామరస్యానికి నెలవైన విజయనగరంలో అతి పెద్ద క్రైస్తవ సమాజంగా పేరెన్నిక గన్న సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ (ఎస్ఎంబి) చర్చ్ 150 వసంతాల వేడుకలు ఈనెల 10 నుంచి ఘనంగా నిర్వహిస్తామని వేడుకల నిర్వాహక ప్రతినిధి, సంఘమిత్ర డాక్టర్ ఆర్ ఎస్ జాన్ పేర్కొన్నారు. సోమవారం సిమ్స్ చర్చ్ లో విజయనగరం జిల్లాలోని వివిధ క్రైస్తవ సంఘాల పెద్దలతో సన్నాహక సమావేశం జరిగింది. అనంతరం కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం ఆర్ఎస్ జాన్ మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 14 వరకు విజయనగరం క్రైస్తవ మహా సభలు ' నిర్వహించనున్నట్టు తెలిపారు. 150 వసంతాల వేడుకల్లోనే ' సౌత్ ఇండియా యూత్ కన్వెన్షన్ ను సెప్టెంబర్ 11 నుంచి 13 వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు.

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 7,8 తేదీల్లో రాజాంలో జరగనున్న సిఐటియు జిల్లా 11వ మహా సభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో డాబా తోటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్ విడుదల చేసిన అనంతరం సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు మాట్లాడారు. 1970 నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహించి కార్మిక హక్కులు కాపాడుతోందని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు పరిరక్షణ కోసం. కనీస వేతనాలు అమలుకోసం , శ్రామిక మహిళలను కార్మికులుగా గుర్తించాలని కోరుతూ 19 సమ్మెలు దేశవ్యాప్తంగా నిర్వహించిన ఘనత సిఐటియుది అని అన్నారు. కార్మిక హక్కులు కాపాడుకునేందుకు, కొత్త హక్కుల సాధనకు మరిన్ని పోరాటాలు చేయాల్సి ఉందన్నారు.

డ్వాక్రా సంఘాల ఘనత చంద్రబాబుదే

ప్రజాశక్తి-విజయనగరం కోట

డ్వాక్రా సంఘాలను ఏర్పాటుచేసి మహిళలను చైతన్యవంతులు చేసిన ఘనతచంద్రబాబుదేనని డిసిసిబి చైర్మన్, టిడిపిజిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. డిసిసిబి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు దశాబ్దాల కాలంలో 4 సార్లు సిఎంగా చంద్రబాబు ప్రజా సంక్షేమం కోసం తీసుకువచ్చిన అతి కీలకమైన పథకాలు, ప్రజలకు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నాయని అన్నారు.

అభివృద్ధికి నిర్వచనం చంద్రబాబు : బేబినాయన

తెర్లాం : రాష్ట్రంలో అభివృద్ధి అన్న పదానికి నిర్వచనంగా సిఎం చంద్రబాబు నిలిచారని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. సోమవారం తెర్లాంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 30 ఏళ్ల క్రితం సిఎంగా బాధ్యతలు స్వీకరించి, తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చేశారని కొనియాడారు. పరిపాలనలో సాంకేతికతను జోడించి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. సమావేశంలో బొబ్బిలి ఎఎంసి చైర్మన్ ఎన్.వెంకట్ నాయుడు, తెర్లాం పిఎసిఎస్ అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు, వైస్ సర్పంచులు కరణం రమేష్, ఎం.శంకర్రావు, లింగా పురం మాజీ సర్పంచ్ భాస్కరరావు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE CHAIRMAN
MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL
ADDITIONAL CHIEF JUDGE, CITY
SMALL CAUSES COURT
AT HYDERABAD.
O.P.No. 660 of 2025**

Between:
Bella Chabasi @ Sawashi and 3 others ...Petitioners
AND
A.Appala Reddy and 2 others ...Respondents

To
R1. A.Appala Reddy S/o Avva Appala Konda, Aged: Major, Occ: Driver of Lorry bearing no.AP 39 UP 3993, R/o: D.No.3-26, Avvapeta, Savaravilli, Bhogapuram, Vizianagaram District-535 216.
R2. Avva Appala Konda S/o Avva Suri, Aged: Major, Occ: Owner of Lorry bearing no.AP 39 UP 3993, R/o: Avvapeta, Saravavilli, Bhogapuram, Vizianagaram District-535 216.

Sir,
Please take notice that the Petitioners herein have filed the above O.P. for compensation for the death in a road accident caused by driving the vehicle. The above OP is posted on **25-09-2025** of your notice and counter, if any. Kindly make it convenient to be present, failing which the matter will be decided in your absence.

// BY ORDER OF THE COURT //

G SRI HARSHA
Advocate
Flat no.203, Valley View,
Plot No 57, Bharani Layout,
Road No 78, Jubilee Hills,
Hyderabad.